# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం | 25 జూన్ 2025 | పేజీలు 8




హైడ్రా కూల్చివేతలతో స్వల్ప ఉద్రిక్తతలు..

- మల్లంపేట్ "పివిఆర్ హైరైజ్ మెడోస్"లో పదేళ్ళ క్రితం రోడ్డు ఆక్రమణ కూల్చివేత..
- కేవిఆర్ వ్యాలీలో "రోడ్డుకు అడ్డంగా" గేటు పెట్టి ప్రహరీగోడ నిర్మాణంపై హైడ్రా చర్యలు..
- ప్రణీత్ అంటీలాలో రోడ్డు ఆక్రమణ తొలగించిన హైడ్రా అధికారులు..
- ప్రహరీగోడను కూల్చిన వెంటనే బ్లూకలర్ ఐరన్ రేకులతో మళ్ళీ ఫెన్సింగ్ ఏర్పాటు..
- మల్లంపేట్‌లో మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకన్న బరితెగింపు..
- మున్సిపల్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డుకు అడ్డంగా గేటు నిర్మాణం..
- రెండేళ్ళుగా "పెన్ పవర్" దినపత్రికలో వరుస కథనాలు వచ్చినా..!
- బీఆర్ఎస్ నేతల భజనతో.. నేటికీ గేటును తొలగించని దుండిగల్ మున్సిపల్..

# రోడ్ల ఆక్రమణలపై... హైడ్రా చర్యలు

## రోడ్డుకు అడ్డంగా మాజీ కౌన్సిలర్ గేటు కూల్చివేతకు మినహాయింపు..?



మల్లంపేట్‌లో రోడ్డు ఆక్రమణల కూల్చివేతలో, మున్సిపల్ అండ్ హైడ్రా..



ఒకవైపు నేతల రాజకీయ లబ్ది..! మరోవైపు ప్రజాప్రతినిధుల మెప్పు పొందేందుకు, అక్రమ కట్టడాలపై అధికారుల నిర్లక్ష్యం..! ప్రజలకు ఇబ్బందులు తలపెట్టే విధంగా ఉన్న, రోడ్డు ఆక్రమణలపై, హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టడం.. దుండిగల్ మున్సిపల్ అధికారుల చేతగాని తనానికి నిదర్శనం.. మల్లంపేట్‌లో గత పదేళ్ళుగా రోడ్డును ఆక్రమించి అనుభవిస్తున్న, హైరైజ్ నిర్మాణ దారులు మున్సిపల్ పరిధిలోనే కదా ఉన్నది..! డూప్లెక్స్ ఇంళ్ళలో నివాసం ఉండేవారు సైతం రోడ్లకు అడ్డంగా గేటుతో ప్రహరీగోడలు ఈ మున్సిపాలిటీ పరిధిలోనే కదా..! మున్సిపల్ విస్మరించిన, ఆక్రమణలపై హైడ్రా కన్నెర్ర చేసింది.. బాచుపల్లి, మల్లంపేట్ సరిహద్దులో ఉన్న ప్రణీత్ అంటీలలో రోడ్డుకి అడ్డంగా ఉన్న ప్రహరిని తొలగించిన కొన్ని గంటల్లోనే రేకుల ఫెన్సింగ్ పెట్టడం గమనార్హం..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 24:

-2లో

# నాడు బీఆర్ఎస్..! నేడు కాంగ్రెస్..! నేతల చుట్టూ ప్రదక్షిణలు..!

## పర్యావరణ ప్రేమికుడి ఆవేదన.. ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని నిరీక్షణ..

- సామాజిక వేత్తగా సేవలు ..! పర్యావరణ ప్రేమికుడిగా కార్యక్రమాలు..
- చెరువులో పడి, ఈత తెలియక, మృతిచెందే ఘటనలతో చలించిన రవిందర్..
- ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని పోరాటం చేస్తున్న యోధుడు రవీందర్..
- దశాబ్దాల తరబడి మంత్రులకు, కలెక్టర్‌లకి రవిందర్ ముదిరాజ్ ఎన్నో విన్నపాలు..
- విద్యార్థి దశ నుండే ఈతను ఒక సాధనంగా నేర్పించి, ప్రాణాలను కాపాడాలనే యత్నం..
- ప్రతియేటా ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 1000 నుండి 1500 మృత్యువాత..




ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని రవిందర్ ముదిరాజ్ విజ్ఞప్తి..

-3లో

# పీఏసీ మీటింగ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ నిర్ణాణంపై చర్చించాం





హైదరాబాద్ పెన్ పవర్:గాంధీ భవన్ లో మంగళవారం (జూన్ 24) పీఏసీ మీటింగ్ వాడీవేడిగా జరిగింది. తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్కతో పాటు మంత్రులు, పీసీసీ కార్యవర్గం పాల్గొన్న ఈ సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు. ఈ మీటింగ్ లో ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ నిర్మాణంపై చర్చించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బూత్ లెవెల్ నుంచి పార్టీ పటిష్టతకు పని చేయాలని.. అందుకు స్పష్టమైన

-2లో

# రోడ్ల ఆక్రమణలపై.. హైడ్రా చర్యలు..



మల్లంపేట్‌లో రోడ్డుకు అడ్డంగా గేటు నిర్మించిన, మాజీ కౌన్సిలర్..




మల్లంపేట్ ప్రణీత్ అంటీలలో హైడ్రా కూల్చివేత అనంతరం, మళ్ళీ రేకుల ఫెన్సింగ్..

## కేవిఆర్ వ్యాలీలో, స్వల్ప ఉద్రిక్తత..

దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్ కేవీఆర్ వ్యాలీలో గత బీఆర్ఎస్ హయాంలో, 11 పార్కు స్థలాలు కబ్జాకు గురైనట్లు, ఉమ్మడి సర్వేలో గుర్తించిన మున్సిపల్ అధికారులు.. ఆ పార్కుల సంగతి దేవుడెరుగు..! రోడ్లకు కూడా భద్రత లేదని మంగళవారం “హైడ్రా” చర్యలతో తేటతెల్లం అయింది.. అసలు మున్సిపాలిటీలో అధికార యంత్రాంగం ఉందా లేదా అనే అనుమానాలు రేకెత్తిస్తుంది.. కేవిఆర్‌లో రోడ్ల ఆక్రమణ తొలగింపులో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నట్లు సమాచారం.. మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు తక్షణ చర్యలు చేపట్టి ఉంటే..! హైడ్రా చర్యలు ఉండేవి కాదని స్థానికులు వ్యక్తం చేశారు..

వెంచర్లో రోడ్డును ఆక్రమించి, అక్రమంగా ప్రహరీగోడ నిర్మించి గేటు నిర్మాణం ఎవరి నిర్లక్ష్యం..?

**దుండిగల్ మున్సిపాలిటీ ఆవిర్భావం చెంది, ఏడేళ్ళు గడిచినా మున్సిపల్ అధికారుల్లో మార్పు రావడంలేదు.. ముఖ్యంగా మున్సిపల్ మొత్తానికి పెద్దగా వ్యవహరించే కమిషనర్, నిర్మాణాలకు, అక్రమ కట్టడాలకు హెడ్డుగా ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులే ఇక్కడ రాజ్యం ఏలుతున్నారు అనడంలో అతిశయోక్తి కాదు.. కమిషనర్‌లు మారినా, నూతన టౌన్‌ప్లానింగ్ అధికారులు బాధ్యతలు స్వీకరించినా..! అక్రమ నిర్మాణాల దందాలకే ప్రాధాన్యత ఇవ్వడం పరిపాటిగా మారింది.. ఒకరకంగా చెప్పాలంటే.. దుండిగల్ మున్సిపల్ అధికారుల చేతగాని తనానికి “హైడ్రా” చర్యలే ఒక నిదర్శనం.. ఈ ఏడేళ్ళలో కమిషనర్‌లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, కేవలం తమ అక్రమార్జనే ధ్యేయంగా, దుండిగల్ మున్సిపాలిటీ నుండి బదిలీలు, ఆపుకొనుటకు,ఇక్కడే విధుల్లో కొనసాగటానికి..! తమ పలుకుబడితోనో, పై అధికారులకు ముడుపులు చెల్లించుకుని, ఇదేచోట నిలదొక్కుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆరోపణలు వస్తున్నాయి..**

- మొదటి పేజి తరువాయి

దుండిగల్ మున్సిపల్ పరిధి మల్లంపేట్‌లో పలుచోట్ల రోడ్డు ఆక్రమణలపై “హైడ్రా” కన్నెర్ర చేసింది.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి, హైడ్రా పరిష్కారం చూపింది.. రోడ్డు ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది, హైడ్రా అధికారులు, పోలీసుల భద్రతతో తొలగించారు.. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, పట్టించుకోక పోవడంతో, పదేళ్ళ క్రితం రోడ్డు ఆక్రమణను కూడా హైడ్రా దృష్టికి తీసుకెళ్ళగా..! మంగళవారం రహదారులకు అడ్డంకులు తొలగించారు.. మల్లంపేట్‌లోని “పివిఆర్ హైరైజ్ మెడోస్‌లో” బిల్డర్ 10 ఏళ్ళ క్రితమే రోడ్డును ఆక్రమించి విల్లాలు నిర్మించగా..!అప్పట్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, హైడ్రా ఏర్పాటుతో తమ సమస్యలు ఒక్కొక్క అపరిష్కృతం అవుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

## రోడ్డుకు అడ్డంగా, మాజీ కౌన్సిలర్ గేటు.. చర్యలేవి కమిషనర్..

మల్లంపేట్‌లో పదేళ్ళ క్రితం రోడ్డు ఆక్రమణను కూల్చేసిన అధికారులు..! రెండేళ్ళ క్రితం మున్సిపల్ అధికారులు, రూ. 7.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్డుకు అడ్డంగా, స్థానిక మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకన్న గేటు నిర్మించినా, నేటికీ చర్యలు శూన్యం.. ప్రభుత్వ నిధులతో సుమారు 30 మీటర్ల పొడవున, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు, సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు.. నిర్మాణం పూర్తికాగానే..! అప్పటి 23వ వార్డు కౌన్సిలర్ మాదాసు వెంకన్న , తన సమీప బంధువు ఓ బీఆర్ఎస్ నేత అండ ఉందనే అహంతో, రోడ్డుకు అడ్డంగా గేటు నిర్మించుకున్నాడు.. పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన కథనంతో ఇంజనీరింగ్ విభాగం ఏఈ చర్యలకు పూనుకోగా..! సంబంధిత కౌన్సిలర్ అధికార పార్టీ అయినందున, కట్టు కథలతో చర్యలు కాలయాపన చేశారు.. నేటికీ చర్యలు తీసుకోకుండా కౌన్సిలర్‌కి పట్టం కట్టారు.. రోడ్డు ఆక్రమణ ఒకరికి చుట్టం, మరొకరికి శత్రువుగా భావించడం అధికారులకే చెల్లుబాటు అవుతుంది.

# పీఏసీ మీటింగ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ నిర్ణాణంపై చర్చించాం

- మొదటి పేజి తరువాయి

కార్యాచరణతో ముందుకు వెళ్ళాలనీ పీసీసీ కి సూచన చేసినట్లు తెలిపారు. ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై చర్చించామని అన్నారు. ఈ కాలాన్ని గోల్డెన్ పీరియడ్ గా పీఏసీ అభినందనలు తెలిపిందని చెప్పారు.పంట నష్ట పరిహారాన్ని గత ప్రభుత్వం పదేళ్ళు పట్టించుకోలేదని.. కానీ ప్రజా పాలనలో రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పథకాలు అమలు చేస్తున్నామని.. ఈ ప్రభుత్వ పథకాలు ఇంటింటికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు గా రెండింటిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని భట్టీ తెలిపారు.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందే: మీనాక్షి నటరాజన్**

పీఏసీ మీటింగ్ లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన సన్నాహాలను అడిగి తెలుసుకున్నారు తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్. ఉప ఎన్నికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందేనని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందర్నీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు బాధ్యతలు అప్పగించారు.

జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ కు ఎవరిని నియమిస్తున్నారని అడిగిన ప్రశ్నకు..

ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని సీఎం రేవంత్ చెప్పారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని ఆదేశించారు. పార్టీ నిర్ణయించి అభ్యర్థిని ప్రకటించే వరకు ఎవరూ కామెంట్స్ చేయొద్దని సూచించారు.

పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని హెచ్చరించారు సీఎం రేవంత్. ఈ సందర్భంగా తమ సేవలను ఉపయోగించుకోవాలని పలువురు సీనియర్లు తెలిపారు. అయితే పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు సీఎం.

పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ గా చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు.

ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతుందని తెలిపారు. వీలైనంత త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహిద్దామని.. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బాధ్యతలు మంత్రులు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.

ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని రవిందర్ ముదిరాజ్ విజ్ఞప్తి..




# నాడు బీఆర్ఎస్..! నేడు కాంగ్రెస్..!
# నేతల చుట్టూ ప్రదక్షిణలు..!



జ్యోతిరావు పూలే భవన్‌లో రవిందర్ ముదిరాజ్ మరో విన్నపం..

## పర్యావరణ ప్రేమికుడి ఆవేదన.. ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని నిరీక్షణ..

అదొక దేశద్రోహం కాదు..! చట్ట వ్యతిరేక విధానాలకు అనుకూలం అంతకంటే కాదు..! ఈత (స్విమ్మింగ్) తెలియక కొన్ని వేల చిన్నారులు, పెద్దలు, ప్రాణాలు పోకుండా, కాపాడేందుకు, ఓ సామాజిక వేత్త, దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం, మానవాళి మనుగడకు అత్యంత దోహదపడేదే.. అయినప్పటికీ ఎందుకింత నిర్లక్ష్యం..? విద్యార్థి దశ నుండే ఈతను ఒక సాధనంగా నేర్పించాలని, అందుకు ఈతను ప్రాథమిక విద్యలోనే పాఠ్యాంశంగా చేర్చి, నేర్పించాలని ఓ సామాజిక సేవకుడు, ప్లాస్టిక్ నియంత్రణకు నిత్యం ప్రజలను చైతన్యపరిచే కోలా రవిందర్ ముదిరాజ్.. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో.. జ్యోతిరావు పూలే భవన్‌లో ఫిర్యాదు చేసే పరిస్థితి దాపురించింది..మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 24:

ఈత ఒక సాధనగా పాఠ్యంలో చేర్చాలని ఈత తెలియక ప్రతియేటా, ఉమ్మడి రాష్ట్రంలో 1000 నుంచి 1500 మంది విద్యార్థులు చనిపోతున్నారని ఈతను పాఠ్యాంశంలో చేరుస్తూ..! ఈత వచ్చిన వారికి రెండు మార్కులు ఇస్తామని..! అదేవిధంగా ఇంట్లో ఉన్న ఇంకుడు గుంత ఉన్నా..! రెండు మార్కులు కలుపుతామని, విద్యార్థులను ప్రోత్సహించాలని సామాజిక కార్యకర్త కోలా రవిందర్ ముదిరాజ్ కోరారు.. పొడుపు కథ రూపంలో 30 మంది జిల్లా కలెక్టర్‌లకు, గత ముఖ్యమంత్రులకు, ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు విజ్ఞప్తి చేసినప్పటికీ..! ఇంతవరకు అధికారులు స్పందించకపోవడం బాధాకరంగా ఉందని రవిందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.. విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఎలా చెప్పాలంటే ఈత వచ్చినవారు నోటితో నీళ్ళు చిమ్ముతాడు కాళ్లు చేతులు నీళ్లపై కొడతారు ఈదుకుంటూ పైకొస్తారని చెప్పాలి.. ఈత రానివారు నీళ్లు తాగుతారు భయంతో చేతులు పైకి కాళ్లు కిందికి పెట్టి చనిపోతారు అని పిల్లలకు ఉపాధ్యాయుడు నేర్పించాలని తెలిపారు..

ఈతను, ఈత ప్రాముఖ్యతను తెలియజేయక పోవడం వల్లనే..! వేలాది మంది విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని రవిందర్ ముదిరాజ్ ఆవేదన చెందారు.. ఈ విషయమై గత 20 సంవత్సరాలుగా పోరాటంతో.. ఇప్పటివరకు కూడా ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా..! ప్రభుత్వాలు నిర్లక్ష్యం పతాక స్థాయికి చేరుకుందని ఆయన అన్నారు.. విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చినట్లయితే ప్రతి విద్యార్థి కూడా తప్పనిసరిగా నేర్చుకుంటాడని ఓ అబ్బాయి ఇంటికి వెళ్ళిన తర్వాత తాత నువ్వు నాయనమ్మని ఈత నేర్పమని అడుగుతాడని సారు రెండు మార్కులు ఇస్తాడట నాకు ఈత నేర్పండి అని చెప్పడం వల్ల వారికి అజ్ఞానం వస్తుందని ఈ విషయమై 20 సంవత్సరాల పోరాటమని తప్పనిసరిగా ఈ విషయమై ఇరు రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు ముఖ్యమంత్రులు, పాఠ్యాంశాలు చేర్చే విధంగా ఉత్తర్వులు ఇస్తారని ముకుళిత హస్తములతో కోరుతూ, మరోసారి ప్రజా భవనంలో వినతి పత్రం అందజేశారు.

- సామాజిక వేత్తగా సేవలు ..! పర్యావరణ ప్రేమికుడిగా కార్యక్రమాలు..
- చెరువులో పడి, ఈత తెలియక, మృతిచెందే ఘటనలతో చలించిన రవిందర్..
- ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని పోరాటం చేస్తున్న యోధుడు రవీందర్..
- దశాబ్దాల తరబడి మంత్రులకు, కలెక్టర్‌లకి రవిందర్ ముదిరాజ్ ఎన్నో విన్నపాలు..
- విద్యార్థి దశ నుండే ఈతను ఒక సాధనంగా నేర్పించి, ప్రాణాలను కాపాడాలనే యత్నం..
- ప్రతియేటా ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 1000 నుండి 1500 మృత్యువాత..

### ఈతరాక మునిగే వారిని రక్షించే మెలకువలు..

ఎవరైనా వెళ్లి నీళ్ళలో మునిగిపోతూ ఉంటే.. రక్షించే క్రమంలో..! బయటకు లాగడానికి ముఖ్యంగా, గట్టు పైనున్న వారు ఒక ధోతిగాని చున్ని గాని, తాడు కానీ, అందించే ప్రయత్నం చేయాలని రవిందర్ ముదిరాజ్ పేర్కొన్నారు.. లేదా తలజుట్టు పట్టి లాగాలి కానీ..! ఈ తరాని వారు దిగితే లాగడానికి ప్రయత్నం చేస్తే మిమ్మల్ని కూడా పట్టుకొని మునిగిపోయే ప్రమాదం ఉంటుందని విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.. ఈత నేర్చుకోవాలంటే ఈత తెలిసిన పెద్దవారిని వెంట తీసుకెళ్లి, ఒక ట్యూబ్ గాని ఒక కర్ర గాని తాడు గాని కట్టుకొని నేర్చుకున్న తర్వాతనే నీటిలో దిగాలని పెద్దలు చెప్పాలి.. ఉపాధ్యాయులు కూడా విద్యను బోధించేటప్పుడు, ఈత రానిదే, నీటిలోకి దిగితే, ప్రమాదమని నేర్పించాలని సూచించారు.. ఒక్కోసారి వేగంగా ప్రవహించే నీటిలో ఈత కూడా పనిచేయదని విద్యార్థులకు సూచించాలని తెలిపారు..



కోలా రవిందర్ ముదిరాజ్.. సామాజిక కార్యకర్త..

# విద్యుత్ సమస్యలపై అధికారుల స్పందన

## త్వరలో చర్యలు తీసుకుంటామన్న రామచంద్ర





**ఎల్బీనగర్, పెన్ పవర్ జూన్ 24 :** గుంటి జంగయ్యనగర్ కాలనీలో గత కొంతకాలంగా కొనసాగుతున్న విద్యుత్ సమస్యలపై అధికారులు స్పందించారు. వనస్థలిపురం విద్యుత్ శాఖ అధికారి రామచంద్ర మంగళవారం కాలనీలో పర్యటించి, సమస్యలను సమీక్షించారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి వచ్చిన రామచంద్ర, స్థానికులను కలుసుకుని సమస్యల వివరాలను తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో చోటుచేసుకుంటున్న అంతరాయాలను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

ఈ పరిశీలనలో లైన్ మెన్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు. సమస్యలపై అధికారులు స్పందించడాన్ని స్థానికులు హర్షించారు.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

- ఆ ముగ్గురు కోటీశ్వరులు ఎలా అయ్యారని ప్రశ్న
- రైతులకే తమ ప్రభుత్వంలో మొదటి ప్రాధాన్యమన్న సీఎం రేవంత్
- గత కేసీఆర్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ధ్యేయమని ప్రకటన
- పదేళ్ల బీఆర్ఎస్, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ హయాంలో అప్పుల కుప్పగా మారితే, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు మాత్రం ఎలా సంపన్నులయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, తమ 18 నెలల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు.కేవలం తొమ్మిది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి రూ.9 వేల కోట్ల నిధులను జమ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. రైతుల ఆశీర్వాదం వల్లే తాను చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయ్యానని, వారి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తమ ప్రజా ప్రభుత్వంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఆ తర్వాతే మహిళలు, యువతకు స్థానం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగలా మార్చేందుకే వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేశామని ఆయన తెలిపారు. గతంలో వరి వేసుకుంటే ఉరేననే పరిస్థితి ఉండేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పి, 48 గంటల్లోనే డబ్బులు జమ చేశామని వివరించారు. దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణమని, వ్యవసాయం అంటే రైతును రాజును చేయడమేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ రాష్ట్రం నెత్తిన రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు పెట్టి వెళ్లారని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలడం కూడా జరిగిపోయిందని విమర్శించారు. "కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి? రాష్ట్రం దివాలా తీస్తే వారంతా ఎలా సంపన్నులయ్యారు?" అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 60 వేల ఉద్యోగాలు కల్పించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' తీసుకువచ్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఇందుకోసం అనేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నామని, వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు.

మహిళలకు రూ.21 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించి ఆదుకున్నామని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించామని అన్నారు. వెయ్యి బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అద్దెకు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని, 8 వేల ఐకేపీ కేంద్రాలను మహిళలకే అప్పగించామని వివరించారు. పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను కూడా స్వయం సహాయక సంఘాలకే అప్పగించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

# హైదరాబాద్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ రాకెట్ గుట్టురట్టు, 10 వెబ్‌సైట్లు క్లోజ్

- బెట్టింగ్ యాప్స్.. ప్రమోట్ చేస్తున్న ముఠా అరెస్ట్
- పోలీసుల అదుపులో నలుగురు ఇన్ఫ్లుయెన్సర్లు
- పరారీలో మరో ముగ్గురు
- ఒక్కొక్కరు రూ. 50 లక్షల వరకు సంపాదన



**హైదరాబాద్ పెన్ పవర్:** బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్న ముఠా పోలీసులకు చిక్కింది. కమీషన్లు ఆర్జిస్తున్న నలుగురు ఇన్ ఫ్ల్యూయెన్సర్లను సైబరాబాద్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. టెలిగ్రామ్, ఇన్ స్టాగ్రామ్ లో మ్లో నిందితులు బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్నట్లు గుర్తించారు. నిందితులకు 10వేల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. బెట్టింగ్ వల్ల ఓ యువకుడు నష్టపోయి సూసైడ్ చేసుకున్నాడు. కమీషన్ తో ఒక్కొక్కరు రూ.50ల క్షలు సంపాదించినట్టు గుర్తించారు. 2019 నుంచి వీరు బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్నారు. 10 విదేశీ వెబ్ సైట్లను నిందితులు ప్రమోట్ చేస్తున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నాం' అన్నారు డిసీసీ సాయి శ్రీ.

ఆన్ లైన్ బెట్టింగ్ బెట్టింగ్ ను ప్రోత్సహిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నట్టు డీసీపీ సాయి శ్రీ తెలిపారు. జూన్ 13న మియాపూర్ నివాసి ఇచ్చిన కంప్లయింట్ తో రంగంలోకి దిగిన పోలీసులు ముఠా గుట్టు రట్టు చేశారు. టెలిగ్రామ్ ఛానెల్ ద్వారా తనను , తన స్నేహితుడిని వరుసగా రూ.50 లక్షలు , రూ.60 లక్షలు మోసం చేశారని, "టాస్ ఫిక్స్ హామీ ఇచ్చారని" అని బాధితుడు పోలీసులకు చెప్పారు.

నిందితులు ఎవరికి చిక్కకుండా తెలివిగా డబ్బును క్రిప్టో కరెన్సీగా మార్చి మోసం చేస్తూ.. 13శాతం కమిషన్ తీసుకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దందాతో - రూ. 80 లక్షలు అక్రమంగా సంపాదించినట్టు తెలిపారు. నిందితులు రాకేష్ రూ.1.7 కోట్లు, దీపక్ రూ.55 లక్షలు, నాయక్ రూ.30 లక్షలు, హేమంత్ రూ.20 లక్షల లాభం పొందారు.

నిందితులు టెలిగ్రామ్ ఖాతాలను సృష్టించి క్రికెట్ మ్యాచ్‌లపై ప్రత్యేకమైన ఇన్‌సైడర్ చిట్కాలను అందిస్తూ ఫిక్స్‌డ్ మ్యాచ్‌లను యాక్సెస్ చేసేవారని పోలీసులు తెలిపారు. బాధితులు మ్యాచ్‌లపై పందెం కాస్తే %ఖూ×% ద్వారా మ్యూల్ ఖాతాలకు డబ్బును బదిలీ చేయమని అడిగారు. నకిలీ ఆధార్ ,పాన్ కార్డులను ఉపయోగించి ఈ ఖాతాలను తెరిచారని పోలీసులు తెలిపారు.

## సికింద్రాబాద్ దోపిడీ కేసులో ట్విస్టులు.. దొంగలను కొట్టిన గజదొంగలు.. చివరికి గోవాలో..



**హైదరాబాద్ పెన్ పవర్:**పొట్టోడిని పొడుగోడు కొడితే.. పొడుగోడిని పోషమ్మ కొట్టిందనే సామెత వినే ఉంటారు.. ఇక్కడ సేమ్ అలాంటి సీనే రిపీట్ అయ్యింది. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని కొట్టేసిన డబ్బును.. గజదొంగలు కొట్టేసి.. ఎంచక్కా పంచుకుని గోవా చెక్కేశారు. గోవాలో ఏం జరిగిందో తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసు లో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు బయటపడుతున్నాయి. గత వారం (2025, జూన్ 2వ వారం) తక్కువ రేట్ లో బంగారం ఇప్పిస్తామని వ్యాపారికి వల వేశారు మధ్యవర్తులు. 20 మంది టీం గా ఏర్పడి వ్యాపారిని బురిడీ కొట్టించారు. పక్కా ప్రాణాలీకతో.. తాము %ూు% పోలీసులని.. తక్కువ ధరకేం బంగారం ఇప్పిస్తామని చెప్పారు. దీంతో రూ.50 లక్షలకు పైగా డబ్బును బ్యాగులో పెట్టి అప్పగించాడు వ్యాపారి. కచ్చితంగా బంగారం ఇప్పించాలని చెప్పగా.. చీప్ ధరలకే బంగారం ఇప్పిస్తామని చెప్పి బ్యాగ్ తీసుకొని వెళ్లిపోయారు.ఇక్కడే మరో ట్విస్ట్ బయపడింది. వ్యాపారి నుంచి తీసుకున్న డబ్బు బ్యాగ్ ను బైక్ పై తీసుకుని వెళ్లింది రాంబాబు టీం. అయితే రాంబాబు ను జేబీఎస్ బస్ స్టాండ్ దగ్గర బైక్ రికవరీ ఏజెంట్లు ఆపారు. బైక్ ఫైనాన్స్ లో ఉంది అంటూ చెకింగ్ చేశారు. బ్యాగ్ లో భారీగా డబ్బు ఉండడం చూసి వారిని బెదిరించి బ్యాగ్ తీసుకొని వెళ్లిపోయారు బైక్ రికవరీ ఏజెంట్స్.అనుకోకుండా వరం ఇచ్చినట్లు వచ్చి పడిన డబ్బును పంచుకుని ఎంచక్కా గోవా వెళ్లిపోయారు. అక్కడ చేయాల్సి ఎంజాయ్ చేస్తూ కావాల్సిన సరదాలు తీర్చుకున్నారు. కానీ ఇక్కడ మరో ట్విస్ట్ ఎదురైంది. వ్యాపారి ఫిర్యాదుతో స్పెషల్ ఆపరేషన్ టీమ్ గోవాలో

ఉన్న బైక్ రికవరీ ఏజెంట్లను పట్టుకున్నారు. అక్కడ16 మందిని అరెస్ట్ చేసి రూ.43 లక్షల తోపాటు 59 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఆదాయం పెంచుకునే అవకాశాలు పుష్కలం? - పట్టించుకోని అధికారులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కి విశాఖలో 'సముద్ర జల విహారం' కేంద్రం నుంచి మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కాకినాడ, మచిలీపట్నంలలో తీరాలున్నా విశాఖే పర్యాటకులకు ఎక్కువ అనుకూలంగా ఉంటుంది. కొత్త బోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తే ఆదాయం పెంచుకోవచ్చు. ఆ దిశగా అధికారుల ప్రణాళిక లేకపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవల పిలిచిన టెండర్ల తీరూ అలాగే ఉంది. సంస్థ ఆదాయానికి నష్టం కలిగించే పరిస్థితి ఉన్నా ఉన్నతాధికారులు ముందుకువెళ్లడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.అసలు కథ నడిచింది ఇక్కడే : ఏపీటీడీసీ గత నెలలో జల విహార ప్రాజెక్టులకు టెండర్లు పిలిచింది. భీమిలి, రుషికొండ, తెన్నేటిపార్క్, మంగమారిపేట, ఫిషింగ్‌హార్బర్, బర్లపేట ప్రాంతాల్లో బోట్లు తిప్పేందుకు సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇక్కడే అసలు కథ నడిచింది. వీటిల్లో డిమాండున్న ప్రాంతాలకు, కొత్తగా నిర్వహించే ప్రదేశాలకు దాదాపు ఒకే రకమైన ప్రాథమిక ధర నిర్ణయించడంపై విమర్శలు వచ్చాయి. ఏటా ఏపీటీడీసీకి రూ.20 లక్షలకుపైన ఆదాయం వచ్చే చోట ప్రాథమిక ధర రూ.3 లక్షలుగా నిర్ణయించడం గమనార్హం. త్వరలోనే గుత్తేదారులకు ఒప్పంద పత్రాలు అందజేయనున్నారు. రుషికొండలో జెట్? స్కీ స్కూటర్ల నిర్వహణకు ఏపీటీడీసీ ప్రాథమిక ధర రూ.4 లక్షలు చూపిస్తే రూ.13 లక్షలకు పాడారు. అక్కడే స్కూబాడైవింగ్ కోసం పిలిచిన టెండరు రూ.17 లక్షలకు వెళ్లింది. భీమిలి తీరంలో రూ.50 వేలకు టెండరు పిలిస్తే రూ.1.75 లక్షలకు దక్కించుకున్నారు. బర్లపేట వద్ద సుమారు అంతే ధరకు వెళ్లింది. ప్రైవేటుకు పెత్తనం : టెండర్లు పిలిచే క్రమంలో ఏపీటీడీసీకి ఎక్కువ ఆదాయం వచ్చే ప్రదేశాల్లో ప్రైవేటుకు పెత్తనం అప్పగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫిషింగ్‌హార్బర్‌లో ఏపీటీడీసీ ప్రస్తుతం 8 సీట్ల బోటు నడుపుతోంది. గతంలో ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ. 60 లక్షల ఆదాయం వచ్చేది. అటువంటి చోట టెండరు పిలిచి ప్రాథమిక ధర రూ.3 లక్షలుగా నిర్ణయించారు. టెండరు పిలవడంతో ఓ గుత్తేదారు రూ.8 లక్షలకు దక్కించుకున్నారు. ఇక్కడ ప్రాథమిక ధర తక్కువగా నిర్ణయించడంపై విమర్శలున్నాయి.

పర్యాటకులకు పండగే - రెండు వంతెనల మధ్యలో బోటు షికారు

**పట్టించుకోని అధికారులు :** విశాఖలో జల విహారం ద్వారా రూ.కోట్ల ఆదాయం వచ్చే అవకాశమున్నా ఏపీటీడీసీ నిర్లక్ష్యం వహిస్తోంది. రుషికొండ, షిషింగ్‌హార్బర్ వద్ద కొత్త బోట్లు నడిపేందుకు

వీలున్నా కొనుగోలు చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. పదేళ్ల కిందట 50 సీట్ల బోటు ఒకటి ఉండేది. హుద్‌హుద్‌కు దెబ్బతినడంతో దాని స్థానంలో స్వర్ణవిహారి అనే 50 సీట్ల బోటు నడిపారు. ఆ సమయంలో ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం వచ్చేది. 2018లో ఆ బోటును ఆపేశారు. అప్పటి నుంచి 8 సీట్ల బోటు హార్బర్ వద్ద నడుపుతున్నారు. డిమాండున్న రోజుల్లో 50 సీట్ల బోటు నడిపితే రోజుకు రూ.లక్ష ఆదాయం వస్తుంది. ఈ కొత్త బోటు ప్రతిపాదనలు ఎప్పటినుంచో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

# ఇజ్రాయెల్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, ఇరు దేశాలు పరస్పర దాడులకు పాల్పడటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్‌తో పాటు ఇజ్రాయెల్ కూడా ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి, తక్షణమే తమ పైలట్లను వెనక్కి పిలవాలని, బాంబు దాడులు నిలిపివేయాలని ఆయన గట్టిగా హెచ్చరించారు.

ది హేగ్‌లో జరిగే నాటో సదస్సుకు బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలు మళ్లీ దాడులు చేసుకున్నాయనే విషయాన్ని ఆయన ధృవీకరించారు. "ఇరాన్‌తో పాటు ఇజ్రాయెల్ కూడా కాల్పుల విరమణను ఉల్లంఘించింది. ఇజ్రాయెల్ చర్య పట్ల నేను సంతోషంగా లేను. టెల్ అవీవ్ శాంతించాలి. అదే నేను కోరుకుంటున్నా" అని ట్రంప్ స్పష్టం చేశారు.

"ఇజ్రాయెల్.. ఆ బాంబులను వేయొద్దు. అలా చేస్తే అది తీవ్ర ఉల్లంఘనే అవుతుంది. మీ పైలట్లను తక్షణమే వెనక్కి రప్పించండి" అని డొనాల్డ్ ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడుల విషయంలో గతంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచిన ట్రంప్, గత రెండు వారాల వ్యవధిలో మిత్రదేశమైన ఇజ్రాయెల్‌కు ఇలా బహిరంగంగా, సూటిగా హెచ్చరికలు జారీ చేయడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

# 12 ఏళ్ల వయసులో మింగిన బ్రష్.. 64 ఏళ్ల వయసులో బయటకు!

- **కడుపునొప్పితో ఆసుపత్రికి వెళితే ఎక్స్ రేలో కనిపించిన 17 సెం.మీ. టూత్‌బ్రష్**
- **చైనాలో 64 ఏళ్ల వ్యక్తి కడుపులో నుంచి బ్రష్ వెలికి తీసిన వైద్యులు**
- **52 ఏళ్ల తర్వాత శస్త్రచికిత్స ద్వారా తొలగించిన వైద్యులు**
- **పేగుల్లో కదలకుండా ఉండటంతో ప్రమాదం తప్పిందన్న డాక్టర్లు**



**హైదరాబాద్ పెన్ పవర్:**చైనాలో ఒక విచిత్రమైన సంఘటన వెలుగు చూసింది. 52 ఏళ్ల క్రితం మింగిన ఒక టూత్‌బ్రష్‌ను వైద్యులు 64 ఏళ్ల వ్యక్తి శరీరం నుంచి తాజాగా బయటకు తీశారు. కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చిన యాంగ్ అనే వ్యక్తికి సాధారణ జీర్ణవ్యవస్థ పరీక్షలు చేస్తుండగా, అతని చిన్న పేగులో 17 సెంటీమీటర్ల పొడవైన టూత్‌బ్రష్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం.. యాంగ్ తన 12వ ఏట ఈ టూత్‌బ్రష్‌ను మింగినట్లు గుర్తుచేసుకున్నారు. భయంతో ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదన్నారు. టూత్‌బ్రష్ దానంతట అదే కరిగిపోతుందని భావించానన్నారు. 52 ఏళ్లుగా బ్రష్ కడుపులోనే ఉన్నప్పటికీ యాంగ్ కు ఎలాంటి ఇబ్బంది కలగకపోవడం గమనార్హం.

ఈ విషయం తెలిసిన వెంటనే, వైద్యులు యాంగ్‌కు ఎండోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించి, 80 నిమిషాల్లో టూత్‌బ్రష్‌ను విజయవంతంగా తొలగించారు. గత మూడేళ్లలో ఒక రోగి జీర్ణవ్యవస్థ నుంచి వస్తువును తీయడానికి ఇంత ఎక్కువ సమయం పట్టడం ఇదే మొదటిసారని వైద్యులు పేర్కొన్నారు. పేగుల్లో ఇలాంటి వస్తువులు కదులుతూ లోపలి కణజాలాన్ని పాడుచేసి, ప్రాణాంతకమైన పేగుల చిల్లులు (ఇంటెస్టినల్ పెర్ఫొరేషన్) కలిగించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు తెలిపారు.

యాంగ్ విషయంలో, టూత్‌బ్రష్ అదృష్టవశాత్తూ పేగులోని ఒక వంపులో కదలకుండా ఉండిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని వారు వివరించారు. యాంగ్ శరీరం నుంచి టూత్‌బ్రష్‌ను విజయవంతంగా తొలగించిన వార్త వైరల్ అవ్వడంతో, ఇన్నేళ్లపాటు శరీరానికి ఎలాంటి హానీ కలగకపోవడం అతని అదృష్టమని పలువురు సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు.

## కులాంతర వివాహంపై ఆగ్రహం.. ఫ్యామిలీలో 40 మంది గుండు కొట్టించుకుని..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఒకపక్క ఆధునిక ప్రపంచంలో ప్రజలు దూరాలను చెరిపేస్తోంటే.. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కులాలు, మతాలు అంటూ పట్టింపులతో బ్రతుకుతున్న ప్రజలు ఉంటూనే ఉన్నారు. కులాంతర వివాహాన్ని నేరంగా చూస్తు సమాజాలు ఇప్పటికీ మన చుట్టుపక్కలు ఉన్నాయి. అయితే తాజాగా ఒడిశాలో జరిగిన ఒక సంఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తాజాగా ఒడిశాలోని రాయగడ జిల్లాకి చెందిన ఒక అమ్మాయి వేరే కులానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అయితే దీనిపై ఆగ్రహించిన ఆమె ఫ్యామిలీ శుద్ధి కర్మ కింద దాదాపు 40 మంది గుండు చేయించుకున్నారు. ఈ ఘటన కాశీపూర్ బ్లాక్‌లోని గోరఖ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బైగనగూడ గ్రామంలో జరిగింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలు వైరల్ అవుతున్నాయి. షెడ్యూల్ తెగ నేపథ్యం ఉన్న వధువు, కుటుంబ అనుమతి లేకుండా షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకోవటం గ్రామస్తులలో అసంతృప్తికి కారణంగా మారిందని తేలింది. దీంతో వధువు కుటుంబంలోని మగ బంధువులు తలలు గుండు చేయించుకుని, మేకలు, కోళ్లు, పందులు వంటి జంతు బలులను వారి స్థానిక దేవతకు సమర్పించాలని గ్రామ కౌన్సిల్ నిర్ణయించింది. వాస్తవానికి రాయగడ గిరిజన సమాజం సాంప్రదాయకంగా వివిధ కులాల మధ్య వివాహాలను నిషేధించటమే దీనికి కారణంగా తెలుస్తోంది.

## ఇరాన్‌కు మా పూర్తి మద్దతు, అణుకేంద్రాలపై దాడులను ఖండిస్తున్నాం: రష్యా



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని రష్యా స్పష్టం చేసింది. ఈ విషయంలో టెహ్రాన్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని, ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్టం చేసుకుంటామని ప్రకటించింది. వ్యూహాత్మక భాగస్వామి అయిన ఇరాన్‌కు రష్యా నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదంటూ వస్తున్న విమర్శలపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తాజాగా స్పందించారు."రష్యా-ఇరాన్ మధ్య ఉన్న బలమైన బంధాన్ని దెబ్బతీయడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు" అని పెస్కోవ్ ఆరోపించారు. సోమవారం నాడు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారని, ఈ సమావేశంలో క్రెమ్లిన్ పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమైనదని అరాఘ్చి ప్రశంసించారని పెస్కోవ్ గుర్తుచేశారు.ఇదే అంశంపై గతంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు కూడా ప్రశ్నలు ఎదురయ్యాయి. ఇరాన్‌కు చిరకాల మిత్రదేశమైనప్పటికీ, సంక్లిష్ట సమయాల్లో రష్యా ఆశించినంతగా సాయం చేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనిపై పుతిన్ స్పందిస్తూ, ప్రస్తుత ఉద్రిక్తతల నడుమ తాము ఎందుకు తటస్థ వైఖరిని అవలంబిస్తున్నారో వివరించారు."గతంలోని సోవియట్ యూనియన్, ఇప్పటి రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన సుమారు 20 లక్షల మంది ప్రజలు ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నారు. మా దృష్టిలో ఇప్పుడు ఇజ్రాయెల్ దాదాపుగా రష్యన్ భాష మాట్లాడే దేశంగా మారింది.

# బీరు సీసాతో పరోటాలు చేసిన భారతీయ గృహిణి... ఇంటర్నెట్ ఫిదా!

**హైదరాబాద్ పెన్ పవర్:**మన భారతీయులకు 'జుగాడ్' (చిట్కా)ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న వస్తువులతోనే అద్భుతమైన, సృజనాత్మకమైన పరిష్కారాలను కనుగొనడంలో మనవాళ్లు సిద్ధహస్తులు. ఇలాంటి 'జుగాడ్' టెక్నిక్‌లు సమయాన్ని, డబ్బును, శ్రమను ఆదా చేస్తాయి. సోషల్ మీడియాలో ఇలాంటి జుగాడ్‌కు సంబంధించిన వీడియోలు తరచూ వైరల్ అవుతూ, భారతీయుల సమయస్ఫూర్తిని, సమస్య పరిష్కార నైపుణ్యాలను చూపిస్తుంటాయి. తాజాగా, ఓ భారతీయ తల్లి చేసిన అద్భుతమైన కిచెన్ జుగాడ్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. చపాతీ కర్ర అందుబాటులో లేకపోవడంతో, ఏకంగా ఖాళీ బీర్ బాటిల్‌నే కర్రగా వాడి పరోటాలు తయారు చేసిన తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.



వివరాల్లోకి వెళితే, ఆర్యన్ ఖేతర్‌పాల్ అనే డిజిటల్ క్రియేటర్ తన ఇన్‌స్టాగ్రామ్ రీల్‌లో ఈ వీడియోను పంచుకున్నారు. విదేశాల్లో చదువుకుంటున్న తనను చూసేందుకు వచ్చిన తల్లి, అక్కడ వంటగదిలో అన్ని సామాన్లు అందుబాటులో లేకపోవడంతో ఈ వినూత్న పద్ధతిని అనుసరించినట్లు ఆర్యన్ తెలిపారు. ముఖ్యంగా పరోటాలు చేయడానికి అవసరమైన చపాతీ కర్ర లేకపోవడంతో, ఆ తల్లి ఏమాత్రం ఆలోచించకుండా ఓ ఖాళీ బీర్ బాటిల్‌ను అందుకున్నారు.ఆ వైరల్ వీడియోలో, తల్లి ఖాళీ బీర్ బాటిల్‌ను అచ్చం చపాతీ కర్రలా ఉపయోగిస్తూ పిండిని ఒత్తి, గుండ్రంగా చదును చేయడం చూడొచ్చు. బాటిల్ బాడీతో పిండిపై నెమ్మదిగా ఒత్తిడి తెస్తూ పరోటాను సాఫీగా చేశారు. పరోటా కొంచెం పల్చగా అయ్యాక, దాని మధ్యలో బంగాళాదుంప కూర (ఆలూ పరాఠా కోసం) ముద్దను ఉంచి, అంచులను జాగ్రత్తగా మూసివేశారు. ఆ తర్వాత మళ్లీ బీర్ బాటిల్‌తోనే ఆ పరోటాను ఒత్తి, చివరగా పెనంపై వేసి కాల్చారు. ఈ మొత్తం ప్రక్రియను చూసిన నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.ఈ వీడియో చూసిన పలువురు నెటిజన్లు ఆ తల్లి సృజనాత్మకతను, ఆమె 'జుగాడ్' స్ఫూర్తిని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. కొందరైతే బీర్ బాటిల్‌ను వంటగదిలో వాడటానికి ఆ తల్లి ఎలా ఒప్పుకున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కామెంట్లలో కొందరు ఇలా స్పందించారు:ఒకరు, "చాలా పర్ఫెక్ట్‌గా గుండ్రంగా చేశారు – మీకు అభినందనలు" అని మెచ్చుకోగా, మరొకరు "నిజమైన చెఫ్ ప్రతిభ ఇది" అని అన్నారు. "మీ అమ్మ దీనికి ఎలా ఒప్పుకున్నారు!!! నమ్మశక్యం కాదు" అని ఓ నెటిజన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "భారతీయ తల్లులను ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు," "ఆధునిక సమస్యలకు అమ్మ ఆధునిక పరిష్కారాలు కావాలి" అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. "ఇది మాకు బాగా కనెక్ట్ అవుతుంది" "నేను నా వాటర్ బాటిల్‌తో చేశాను" "మా అమ్మ అయితే ఆ బాటిల్‌ను నా తలపై పగలగొట్టేవారు" వంటి కామెంట్లు కూడా వెల్లువెత్తాయి. "భారతీయ తల్లులు నిజంగా చాలా ప్రత్యేకం," "మనం (భారతీయ తల్లులం) చేసే జుగాడ్ అంటే నాకు చాలా ఇష్టం. అది కూడా విజయవంతంగా చేస్తాం" "మా తమ్ముడికి మొమో తినాలనిపించినప్పుడు నేను కెచప్ బాటిల్‌తో చేశాను" అంటూ పలువురు తమ అనుభవాలను కూడా పంచుకున్నారు.

# ఇరాన్ లో ఆ 400 కిలోల యురేనియం ఇప్పుడు ఎక్కడ?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై అమెరికా గత వారం జరిపిన వైమానిక దాడుల అనంతరం, సుమారు 400 కిలోల శుద్ధి చేసిన యురేనియం నిల్వలు కనపడకుండా పోవడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిణామం ఇరాన్ అణు కార్యక్రమంపై కొత్త అనుమానాలకు, భద్రతాపరమైన ఆందోళనలకు దారితీస్తోంది.



అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ, గల్లంతైన యురేనియం దాదాపు 10 అణుబాంబుల తయారీకి సరిపోతుందని, దీనిని 60 శాతం వరకు శుద్ధి చేశారని, అణ్వాయుధంగా మార్చాలంటే 90 శాతానికి శుద్ధి చేయాల్సి ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో అణు ఒప్పందంపై చర్చలు పునఃప్రారంభించేటప్పుడు, ఈ యురేనియం ఇరాన్‌కు బలమైన బేరసారాల అస్త్రంగా మారవచ్చని నిపుణుల అంచనా.గత వారం ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ నగరాల్లోని ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా శక్తివంతమైన 'బంకర్ బస్టర్' బాంబులతో దాడులు చేసింది. అయితే, ఈ దాడులకు కొద్ది రోజుల ముందే ఇరాన్ ఈ యురేనియం నిల్వలను, కొన్ని కీలక పరికరాలను రహస్య ప్రదేశాలకు తరలించి ఉండవచ్చని అమెరికా, ఇజ్రాయెల్ నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాడులకు ముందు ఫోర్డో అణు కేంద్రం బయట 16 ట్రక్కులు నిలిపి ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాలు చూపించాయని, ఆ తర్వాత ఆ ట్రక్కులు మాయమయ్యాయని 'ది న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది.తమ అణు కార్యక్రమం శాంతియుత ప్రయోజనాలకేనని ఇరాన్ పునరుద్ఘాటిస్తున్నప్పటికీ, ఈ పరిణామాలు ఆ వాదనలను బలహీనపరుస్తున్నాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (%ఋజూజూ%) చీఫ్ రఫేల్ గ్రాసీ, వీలైనంత త్వరగా ఇరాన్ అణుకేంద్రాల్లో తనిఖీలను పునఃప్రారంభించాల్సిన ఆవశ్యకతను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి స్పష్టం చేశారు. సైనిక ఘర్షణలు కొనసాగితే, ఈ తనిఖీలు ఆలస్యమై, దౌత్యపరమైన పరిష్కార అవకాశాలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు, ఇరాన్ అణ్వాయుధాల తయారీ సామర్థ్యంపై అమెరికాలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ వారాల్లోనే అణుబాంబులను తయారు చేయగలదని కొందరు అధికారులు చెబుతుండగా, మరికొందరు దీనికి కనీసం మూడేళ్లు పడుతుందని అంచనా వేస్తున్నారు. గల్లంతైన యురేనియం ఎక్కడికి చేరిందనేది కీలక ప్రశ్నగా మారింది. ఈ పరిణామం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచే ఆస్కారముంది.

## మధ్యప్రాచ్యం, యూరప్ దేశాలకు
## ఎయిరిండియా విమానాల పునరుద్ధరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఖతార్‌లోని అమెరికా వైమానిక స్థావరం అల్ ఉదెయిద్‌పై ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో నిలిపివేసిన విమాన సర్వీసులను ఎయిరిండియా మంగళవారం నుంచి పునరుద్ధరిస్తోంది. మధ్యప్రాచ్యం, యూరప్ లోని పలు ప్రాంతాలకు ఎయిరిండియా విమాన సర్వీసులు తిరిగి ప్రారంభం కానున్నాయి.

మంగళవారం ఎయిరిండియా ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. "మధ్యప్రాచ్యంలోని కొన్ని ప్రాంతాల్లో గగనతలాలు క్రమంగా తెరుచుకుంటున్నందున, ఎయిరిండియా ఈ రోజు నుంచి దశలవారీగా ఆయా ప్రాంతాలకు విమాన సర్వీసులను పునఃప్రారంభిస్తుంది. జూన్ 25 నుంచి మధ్యప్రాచ్యానికి చాలా వరకు కార్యకలాపాలు తిరిగి ప్రారంభమవుతాయి. గతంలో రద్దు చేయబడిన యూరప్ విమాన సర్వీసులు కూడా నేటి నుంచి క్రమంగా పునరుద్ధరించబడుతున్నాయి. అమెరికా తూర్పు తీరం మరియు కెనడాకు సర్వీసులు వీలైనంత త్వరగా పునఃప్రారంభించబడతాయి" అని ఆయన తెలిపారు.కొన్ని విమానాలు ఆలస్యం కావచ్చని లేదా రద్దు కావచ్చని, ప్రయాణికులు మరియు సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని, సురక్షితం కాని అన్ని గగనతలాలను నివారిస్తామని ఎయిర్ లైన్ పేర్కొంది.

"కొన్ని విమానాలు పొడిగించిన రూటింగ్ మార్పులు లేదా ప్రయాణ సమయాల కారణంగా ఆలస్యం లేదా రద్దు కావచ్చు. అయితే, అంతరాయాలను తగ్గించడానికి మరియు మా షెడ్యూల్ సమగ్రతను పునరుద్ధరించడానికి మేము కట్టుబడి ఉన్నాం. ఎయిరిండియా ఎప్పటికప్పుడు సురక్షితం కాదని అంచనా వేయబడిన గగనతలాలను తప్పించడం కొనసాగిస్తుంది. ప్రయాణికులకు ఏవైనా అప్‌డేట్‌లు ఉంటే తెలియజేస్తాం. వారి సహనానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాం. మా ప్రయాణికులు, సిబ్బంది మరియు విమానాల భద్రత మా ప్రథమ ప్రాధాన్యత" అని ఎయిరిండియా ప్రతినిధి వివరించారు.

## రెండేళ్లలో 12 పెళ్లిళ్లు - వాళ్లే టార్గెట్?

**హైదరాబాద్ పెన్ పవ**ంఇటీవల పెళ్లి పేరుతో మోసాలు పెరిగిపోతున్నాయి. దొంగ పెళ్లి కూతుళ్లు, పెళ్లి కొడుకులు డబ్బు సంపాదన ధ్యేయంగా మోసాలకు పాల్పడుతున్న ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. డబ్బుల కోసం 12 మోసపూరిత పెళ్లిళ్లకు ఒడిగట్టారంటూ ఓ ముఠాపై డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు అందింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, నరసాపురానికి చెందిన జీవీ రాజేశ్వరి, లక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన సుజాత తదితరులు ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్?కు ఫిర్యాదు అందజేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం: కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన యువతి ఆమె తల్లి వీరలక్ష్మి, తండ్రి పాత్రధారి రామకృష్ణ, కల్యాణ్, మద్దాల శ్రీనివాస్, దుర్గ ముఠాగా ఏర్పడి కోర్టులో విడాకుల కేసులు నడుస్తున్న వారే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. రామచంద్రపురానికి చెందిన ఈ ముఠా రెండేళ్లలో పెళ్లి పేరిట 12 మందిని నమ్మించి తర్వాత వేధింపులకు పాల్పడి భారీగా డబ్బులు వసూలు చేశారన్నారు. వీరి బాధితులు కొందరు ఆత్మహత్యాయత్నం చేశారన్నారు.

**వాళ్లే టార్గెట్ :** విడాకులు తీసుకుని నిరాశలో ఉన్న యువకులు, వారి కుటుంబ సభ్యులకు మాయమాటలు చెప్పి వివాహం వరకు తీసుకువెళ్తారన్నారు. ఆ ముఠాలోని యువతి, యువకుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి నమ్మకం కుదిరేలా చేస్తుందన్నారు. అమ్మాయిని చూసేందుకు అబ్బాయి బంధువులను ఆహ్వానించి ఎక్కువ మంది రాకూడదని షరతు విధిస్తారన్నారు. పెళ్లి విషయంలో తొందరపెట్టి రెండో వివాహం చేసుకుంటున్నట్లు సంతకాలు సైతం తీసుకుంటారన్నారు. కొద్దిరోజులకే వేధింపులు ప్రారంభిస్తారన్నారు. డబ్బులు ఇచ్చినా ఇంకా కావాలంటూ తర్వాత వెంటాడుతారన్నారు. వీరి బాధితుల్లో వివిధ ప్రాంతాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. ఇటీవల పాలకొల్లులో కేసు నమోదు కావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారన్నారు. నిత్య పెళ్లికుమార్తె, ఆ ముఠా సభ్యులను శిక్షించి కాజేసిన సొమ్ము తిరిగి ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.తమపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ యువతి ఫిర్యాదు చేసినట్లు రామచంద్రపురం ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

# వందే భారత్ రైలులో నీరు లీకేజీ... స్పందించిన రైల్వే శాఖ

- ఢిల్లీ వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో నీటి లీకేజీతో ప్రయాణికుల అవస్థలు
- రైలు బోగీ పైకప్పు నుంచి కారుతున్న నీటితో తడిసిన సీట్లు, లగేజీ
- ఏసీ కూడా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ప్రయాణికుడు
- ఏసీ డ్రెయిన్ రంధ్రాలు మూసుకుపోవడమే కారణమన్న రైల్వే శాఖ



**హైదరాబాద్ పెన్ పవర్:**వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులకు చేదు అనుభవం ఎదురైంది. ఢిల్లీ వెళుతున్న వందే భారత్ రైలులో పైకప్పు నుంచి నీరు కారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటన కారణంగా సీట్లు తడిసిపోవడమే కాకుండా, ప్రయాణికుల సామాన్లు కూడా నీటితో తడిసిపోయాయి. ఈ పరిస్థితిని ఒక ప్రయాణికుడు తన కెమెరాలో బంధించగా, ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.జూన్ 23న వారణాసి నుంచి న్యూఢిల్లీ వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. రైలు సి-7 కోచ్‌లోని 76వ నంబర్ సీటు వద్ద ఈ సమస్య తలెత్తింది. రైలు ప్రయాణంలో ఉండగా, ఒక్కసారిగా పైకప్పు నుంచి నీరు కారడం మొదలైంది. దీనితో పాటు ఏసీ కూడా సరిగా పనిచేయకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు అధికమయ్యాయి.

ఈ ఘటనపై దర్శిల్ మిశ్రా అనే ప్రయాణికుడు 'ఎక్స్' వేదికగా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. "వందే భారత్ రైల్లో ఏసీ పనిచేయడం లేదు, పైగా నీళ్లు కారుతున్నాయి. అధిక ఛార్జీలు చెల్లించినా ప్రయాణం చాలా అసౌకర్యంగా ఉంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దయచేసి ఈ సమస్యను పరిష్కరించండి" అంటూ తన పీఎన్ఆర్ నంబర్‌తో పాటు రైల్వే మంత్రిత్వ శాఖ, ఐఆర్‌సీటీసీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే సేవలను ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు.

### రైల్వే శాఖ స్పందన

ఈ వీడియో వైరల్ కావడంతో రైల్వే శాఖ స్పందించింది. తమ అధికారిక 'ఎక్స్' ఖాతా 'రైల్వే సేవ' ద్వారా దీనిపై వివరణ ఇచ్చింది. "ట్రైన్ నంబర్ 22415 (వారణాసి-న్యూఢిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్) లోని సి-7 కోచ్ (సీటు నెం. 76) లో రిటర్న్ ఎయిర్ డక్ట్ నుంచి నీరు లీక్ అయినట్లు ఫిర్యాదు అందింది.

ఆర్ఎంపీయూ కూలింగ్ కాయిల్ కింద ఉండే డ్రిప్ ట్రేలోని డ్రెయిన్ రంధ్రాలు, రిటర్న్ ఎయిర్ ఫిల్టర్ కారణంగా మూసుకుపోయాయి. దీనివల్ల ఏసీ నుంచి వచ్చిన నీరు అక్కడ పేరుకుపోయింది" అని రైల్వే సేవ పోస్ట్ చేసింది.

"రైలు బ్రేక్ వేసినప్పుడు, పేరుకుపోయిన ఆ నీరు రిటర్న్ ఎయిర్ డక్ట్‌లోకి ప్రవేశించి, ప్రయాణికుల ప్రాంతంలోకి లీక్ అయింది. ఈ సమస్యను గుర్తించి, తగిన చర్యలు తీసుకున్నాం" అని రైల్వే శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

# ఇరాన్ పై దాడులకు బి-2 బాంబర్లు ఇలా బయల్దేరాయి..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరాన్ అణు కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'కు సంబంధించిన కీలక దృశ్యాలను యూఎస్ రక్షణ శాఖ విడుదల చేసింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా అత్యంత శక్తివంతమైన బి-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లు పాల్గొన్నాయి. మిస్సోరిలోని వైట్‌మ్యాన్ వైమానిక స్థావరం నుంచి ఈ బాంబర్లు బయల్దేరి, ఇరాన్‌లోని అణు కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించి, సురక్షితంగా తిరిగి తమ స్థావరానికి చేరుకున్నాయి.

### వెలుగులోకి వచ్చిన విజువల్స్

అమెరికా రక్షణ శాఖ విడుదల చేసిన వీడియోలో, బి-2 బాంబర్ వైట్‌మ్యాన్ ఎయిర్‌బేస్‌లోని హ్యాంగర్ నుంచి బయటకు రావడం, జూన్ 21న తెల్లవారుజామున 12:01 గంటలకు టేకాఫ్ కోసం సిద్ధమవడం వంటి దృశ్యాలు ఉన్నాయి. ఆ తర్వాత, ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసుకుని 'స్పిరిట్' బాంబర్లు తిరిగి అదే వైమానిక స్థావరంలో ల్యాండ్ అవుతున్న దృశ్యాలను కూడా ఈ వీడియోలో చూపించారు.

ఈ ఆపరేషన్ జూన్ 21న అర్ధరాత్రి దాటాక 00:01 గంటలకు ప్రారంభమైందని, బి-2 బాంబర్లు మరుసటి రోజు, అంటే జూన్ 22న వైట్‌మ్యాన్ స్థావరానికి తిరిగి వచ్చాయని అధికారులు తెలిపారు. మొత్తం 37 గంటల పాటు సాగిన ఈ ఆపరేషన్, 2001లో ఆఫ్ఘనిస్థాన్‌లో జరిగిన 'ఆపరేషన్ ఎండ్యూరింగ్ ఫ్రీడమ్' (ఓఈఎఫ్) తొలి రోజుల్లో బి-2 బాంబర్లు 44 గంటల పాటు ప్రయాణించిన తర్వాత, ఇదే రెండో అత్యంత సుదీర్ఘమైన ఆపరేషన్‌గా రికార్డు సృష్టించింది.

### అత్యంత శక్తివంతమైన బాంబులతో దాడులు

ఈ దాడుల్లో అమెరికాకు చెందిన అత్యంత శక్తివంతమైన జీబీయూ-57 మ్యాసివ్ ఆర్డినెన్స్ పెనెట్రేటర్ (ఎంఓపీ) బాంబులను ఉపయోగించారు. ఈ భారీ బంకర్ బస్టర్ బాంబులను కేవలం బి-2 స్పిరిట్ బాంబర్ల ద్వారా మాత్రమే ప్రయోగించడం సాధ్యమవుతుంది. సుమారు 30,000 పౌండ్ల బరువుండే ఈ జీబీయూ-57 బాంబు, భూమిలోకి 200 అడుగుల లోతు వరకు చొచ్చుకుపోయి లక్ష్యాలను ధ్వంసం చేయగలదు. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఎషఫాన్ అనే మూడు ప్రాంతాల్లో ఉన్న అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఈ బాంబులు అత్యంత అనువైనవిగా అమెరికా భావించింది. ఈ బాంబు ఫ్యూజ్ ఆలస్యంగా పేలేలా చేసి, గరిష్ఠ నష్టాన్ని కలిగించేలా రూపొందించారు.

### 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' సాగిందిలా...

ఈ ప్రధాన దాడి బృందంలో ఏడు బి-2 బాంబర్లు పాల్గొన్నాయి. ప్రతి విమానంలో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. ఇవి వైట్‌మ్యాన్ స్థావరం నుంచి బయల్దేరి, మార్గమధ్యంలో నిర్దేశిత చెక్‌పాయింట్ల వద్ద గాలిలోనే ఇంధనం నింపుకుంటూ మిస్సోరి నుంచి తూర్పు దిశగా ఇరాన్ వైపు ప్రయాణించాయి.యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్రకామ్) పరిధిలో ఈ బాంబర్లు తమకు సహాయం అందించే బృందంతో కలుసుకున్నాయి. ఈ క్లిష్టమైన విన్యాసానికి ఇరుకైన గగనతలంలో వివిధ వ్యవస్థల మధ్య కచ్చితమైన సమన్వయం అవసరమైంది. ఇదంతా చాలా తక్కువ కమ్యూనికేషన్లతో పూర్తి చేశారు.

దాడి బృందం ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించడానికి కొద్దిసేపటి ముందు, సెంట్రకామ్ బాధ్యతాయుత ప్రాంతంలోని ఒక అమెరికా జలాంతర్గామి రెండు డజన్లకు పైగా టోమహాక్ భూతల క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించి, కీలకమైన ఉపరితల మౌలిక సదుపాయాల లక్ష్యాలను ధ్వంసం చేసింది.

'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' బృందం ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించగానే, అమెరికా కొన్ని మభ్యపెట్టే వ్యూహాలను అమలు చేసింది. ఇందులో భాగంగా, నాలుగో మరియు ఐదో తరం విమానాలు బాంబర్ల బృందానికి ముందుగా, అత్యంత వేగంగా, ఎత్తైన ప్రదేశంలో దూసుకెళ్లి, శత్రు విమానాలు మరియు భూమి నుంచి గాల్లోకి ప్రయోగించే క్షిపణుల ముప్పును పసిగట్టాయి. శత్రువులను తప్పుదారి పట్టించేందుకు డెకాయ్‌లను కూడా వాడారు.సాయంత్రం 6:40 గంటలకు (ఇరాన్ కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2:10 గంటలకు), మొట్టమొదటి బి-2 బాంబర్ ఫోర్డోలోని పలు లక్ష్యాలపై రెండు జీబీయూ-57 ఎంఓపీ బాంబులను జారవిడిచింది. ఆ తర్వాత మిగిలిన బాంబర్లు కూడా తమ నిర్దేశిత లక్ష్యాలపై దాడులు చేశాయి. రెండు అణు లక్షిత ప్రాంతాలపై మొత్తం 14 ఎంఓపీ బాంబులను ప్రయోగించినట్లు తెలిసింది. ఇరాన్‌లోని మూడు అణు మౌలిక సదుపాయాల లక్ష్యాలపై సాయంత్రం 6:40 నుంచి 7:05 గంటల మధ్య దాడులు జరిగినట్లు సమాచారం.